26న జనరల్‌బాడీ సమావేశం



మాట్లాడుతున్న అందోజు రవీంద్రచారి

నాగోలు: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఎల్‌బీనగర్ నియోజకవర్గం జనరల్‌బాడీ సమావేశం ఈ నెల 26 కొత్తపేట బీజేఆర్ భవనంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి, నియోజకవర్గం కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎల్‌బీనగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరాల సందర్భంగా పార్టీ శ్రేణులు వాడవాడలా శత జయంతి ఉత్సవాలను ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. భారతదేశ సంపూర్ణ స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటంలో ప్రాణాలను లెక్కచేయకుండా వేలాది మంది త్యాగాలు చేసిన వీర చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదే అన్నారు. దేశంలోని వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఐక్యం చేసి కేంద్రంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలు, మతోన్మాద విధానాలపై ఐక్య ఉద్యమాలు చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. ఈ సమావేశంలో బాతరాజు నర్సింహా, బోయపల్లి రాములు గౌడ్, కందుల సుధాకర్, రమావత్ సక్రు పాల్గొన్నారు.

కార్తీక వన భోజనాలు.. సందడిగా కాలనీలు



కార్యక్రమంలో పాల్గొన్న రెడ్డి సంఘం నేతలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కార్తీక మాస వన భోజనాల కార్యక్రమాలతో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలు సందడిగా మారాయి. పలు కులసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాలకు రాష్ట్రంలోని ప్రముఖ నేతలు హాజరయ్యారు.

రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో..

రెడ్డి జాగృతి, రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ ఆటోనగర్‌లోని అనన్య ఎకో రిసార్ట్స్‌లో కార్తీక వనభోజనాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణతో పాటు బీజేపీనేత రాణి రుద్రమ, ఈటల జమున, కార్పొరేటర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పిట్ట శ్రీనివాస్‌రెడ్డి, నూకల పద్మారెడ్డి, కొట్టం మధుసూదన్‌రెడ్డి, గంగదాసు కృష్ణారెడ్డి, అమరేందర్‌రెడ్డి, విశ్వశాంత్‌రెడ్డి, పుష్పలతారెడ్డి, నీరజారెడ్డి, మమతారెడ్డి, పార్థురెడ్డి రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాందయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

అఖిల భారత పద్మశాలి సంఘం, మన్సూరాబాద్ ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాల కార్యక్రమాన్ని మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని యోగాషెడ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పద్మశాలి సంఘం నేతలతో పాటు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గంజి సత్తయ్య, నేతలు గంజి వెంకటేశం, గజం సత్యనారాయణ, గుర్రం రమేష్, ఉపాధ్యక్షులుగా సీతా వెంకటేశం పాల్గొన్నారు.

కమ్మసేవా సంఘం ఆధ్వర్యంలో...

కమ్మ సేవా సంఘం, వనస్థలిపురం ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని హరిణి వనస్థలి జాతీయ పార్కు (డీర్‌పార్కు)లో కార్తీక మాస వనభోజనాలను నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందిన డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

అక్బర్‌బాగ్, పల్టన్ చౌరస్తా, దయానంద్ నగర్, ఆనంద్ నగర్, మలక్‌పేట్, నూర్‌ఖాన్ బజార్ ఆఫీస్, లాల్‌మిట్టీ దర్గా, బోడ్లేషా కిడికి, చెన్నయ్ కేఫ్, యశ్రాఫ్‌నగర్, సాదత్‌నగర్, సమీనా హాస్పిటల్, జోవహర్ పురా, జోరాబీ దర్గా, మౌలానా ఆజాద్ నగర్, ఈదీ బజార్, ధోబీఘాట్, ఇరానీ హోటల్, సాదత్‌నగర్ దర్వాజా పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

రిలియన్స్ ట్రెండ్ మెయిన్‌రోడ్, పోస్టాఫీస్, జాస్మిన్ హోటల్, కేజీహెచ్ హాస్పిటల్, సలీంనగర్ మున్సిపల్ పార్క్, నాగబౌలి, బిన్నీసాబ్ బంగ్లా, కమలేషా మాస్క్, ఫరత్‌నగర్ గ్రేవ్‌యార్డ్, ఎంఆర్‌ఓ ఆఫీస్, బన్నాక, ఈదీబజార్, అన్మోల్ హోటల్, సీతమ్మతోట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

వనస్థలిపురం: కార్తీక మాసం సందర్భంగా వనస్థలిపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సచివాలయనగర్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కార్తీక వన భోజనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సామూహిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు జయరాములు, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, వెంకటస్వామి పాల్గొన్నారు.

స్నేహపురి కాలనీలో..

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని గోదా సమేత పద్మావతి వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో సత్తా



సదనం సిబ్బందితో రూబెన్

సైదాబాద్: ప్రభుత్వ సదనంలో ఆశ్రయం పొందుతున్న బాలుడు జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. హైదరాబాద్ జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రగతినగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సీనియర్స్ ఆర్చరీ పోటీల్లో సదనం బాలుడు రూబెన్ సత్తా చాటాడు. గత నెలలో రూబెన్ రాష్ట్రస్థాయి అండర్–19 ఆర్చరీ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొన్నాడు. జూనియర్ స్థాయి క్రీడాకారుడైన రూబెన్ సీనియర్స్ విభాగంలోనూ జిల్లా స్థాయిలో రాణించడం అభినందనీయమని రాష్ట్ర జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా అలీబేగ్ అన్నారు. డిసెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్స్ విభాగం ఆర్చరీ పోటీల్లో రూబెన్ పాల్గొంటాడన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.33, వంకాయ రూ.35, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.25, క్యారెట్ రూ.60, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.45, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.28, సొరకాయ రూ15, పొట్లకాయ రూ.19, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.205, చిలుకడదుంప రూ.55, కీర రూ.17, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.60. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

కులగణనను పకడ్బందీగా చేపట్టాలి

ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్, వేదికపై మధుయాష్కీగౌడ్

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం కులగణనను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కొత్తపేట బాబూజగ్జీవన్ రామ్ భవన్‌లో ఆదివారం రాత్రి రాష్ట్ర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కులగణన– శాస్త్రీయ అవగాహనపై నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కులాలు, మతాలు, అంతరాయాలు లేని, మనిషిని మనిషి గౌరవించి అందరూ సమానంగా బతికే సోషలిజం వస్తుందని అంబేడ్కర్ భావించారని 75 ఏళ్ల గడిచినా అది నెరవేరలేదన్నారు. ప్రస్తుతం అనేక కులాలు దేశవ్యాప్తంగా మమ్మల్ని ఓబీసీలో చేర్చండి, ఏబీసీడీ వర్గీకరణ చేయండని అనేక ఉద్యమాలు జరుగుతున్నాయన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులగణను చిత్తశుద్ధితో చేపడుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులగణనను అడ్డుకోవాలని చూస్తుందన్నారు. బీసీ ప్రధానమంత్రి ఉన్నా కులగణనకు సహకరించడం లేదని, కులగణనతో ప్రజలు విడిపోతారని అర్థం లేని వాదనను ముందుకు తీసుకు వస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని ప్రమాణంగా రాహుల్ గాంధీ కులగణన చేయాలనుకుంటే.. ప్రధాని మోదీ మాత్రం మతాన్ని ముందుకు తీసుకొచ్చి ముస్లింలకు అధికారం వస్తుందని అర్థం లేని మాటలు ఆడుతున్నారన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి ఫలాలు, రాజ్యాధికారంలో వాటా దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరి గౌరిశంకర్, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు చలకాని వెంకట్ యాదవ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూరి రాజు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకంటి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అజయ్ కార్తీక్

చంపాపేట: తొర్రూర్ క్రికెట్ మైదానంలో అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో వచ్చేనెల 14న నిర్వహించనున్న మూడో ఇంటర్ స్కూల్ అథ్లెటిక్స్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం చంపాపేటలో రాష్ట్ర టీపీయూఎస్ అధ్యక్షుడు అజయ్ కార్తీక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ.. 08–16 సంవత్సరాల విద్యార్థులు పోటీలలో పాల్గొనవచ్చన్నారు. రన్నింగ్, జంపింగ్, త్రోబాల్, తదితర పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించటంతో పాటు వారికి మూడు నెలల పాటు అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ అథ్లెటిక్స్ అర్హత పోటీలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వినోద్, రేవంత్, సాగర్, గణేష్, జితేందర్, నరేష్, విజయ్ పాల్గొన్నారు.

లగచర్ల రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న రెడ్‌ఫ్లాగ్ నేతలు

మన్సూరాబాద్: లగచర్ల రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ ఎంఎల్ (రెడ్‌ఫ్లాగ్) రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌ఖన్నా, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సంతోష్ డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఈ రెడ్డి గార్డెన్స్ సమీపంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల చుట్టూ పక్కల గ్రామాల రైతుల నుంచి అక్రమంగా భూములు లాక్కోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూ సేకరణను ఆపి రైతులపై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే పోరాటాలతో గుణపాఠం చెబుతామన్నారు. డిసెంబర్ 13,14,15లో బాగ్ లింగంపల్లిలో నిర్వహించే టీయూసీఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎండీ ఖాసీం, సుధమల్ల భాస్కర్, మాన్యపు బుజంధర్ పాల్గొన్నారు.

సేవ చేయడానికి వయసు అడ్డుకాదు



సైదాబాద్: సామాజిక సేవ చేయడానికి వయసు అడ్డు కాదని ఆర్.తిరుపతిరావు అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని జీఎస్ఆర్ హాస్పిటల్‌కు చెందిన హాస్టల్‌లోని 90 మంది గ్రహణం మొర్రి (క్లెఫ్ట్) బాధిత బాలలకు ఆయన బ్యాగులు అందజేశారు. తిరుపతిరావు మనుమడు ఎస్.లలిత్‌కుమార్ శ్రీదత్తా కూడా చిన్నతనంలో గ్రహణం మొర్రి వ్యాధికి ఇదే హాస్పిటల్‌లో చికిత్స పొందాడని ప్రస్తుతం అతను కాలిఫోర్నియా అమడోర్‌వ్యాలీ హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నాడు. బాయ్స్ స్కౌట్స్ అమెరికాలో తన ఈగల్ స్కౌట్స్ సర్వీస్ ప్రాజెక్ట్‌లో భాగంగా తనలాగా క్లెఫ్ట్ వ్యాధితో బాధపడుతున్న బాలలను ఆదుకోవడానికి అక్కడ ఫండ్స్ సేకరించాడు. వాటితో కొన్న బ్యాగులు, నోటి సంరక్షణ ఉత్పత్తులను తాతయ్య ద్వారా బాధిత బాలలకు అందజేస్తున్నాడు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం



వినతిపత్రం ఇస్తున్న శక్తినగర్ కాలనీవాసులు

వనస్థలిపురం: డివిజన్‌లోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని శక్తినగర్ కాలనీలో ఆయన పర్యటించి రోడ్లు, డ్రైనేజీ సమస్యలు, వర్షం నీరు నిలిచే ప్రాంతాలపై ఆరా తీశారు. త్వరలోనే అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అనంతరం వివిధ సమస్యలపై కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు.

యూనియన్ బీ-2898తోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న చవ్వ సతీష్‌కుమార్

దిల్‌సుఖ్‌నగర్: జలమండలి ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్(బీ–2898) ముందు వరుసలో ఉంటుందని అధ్యక్షులు చవ్వ సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎల్‌బీనగర్ జలమండలి కార్యాలయం ఆవరణలో నిర్వహించిన యూనియన్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో సతీష్‌కుమార్ పాల్గొన్నారు. డివిజన్–10 జలమండలి ఉద్యోగులంతా రాబోయే జలమండలి ఎన్నికల్లో తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ గుర్తయిన త్రిశూలానికి ఓటేసి సతీష్‌ను గెలిపించుకుంటామని తీర్మానం చేశారు. సతీష్ మాట్లాడుతూ.. మన సంఘానికి అధికార పార్టీకి చెందిన మధుయాష్కీగౌడ్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారని ఆయన సారథ్యంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రరాజ్, దేవేందర్, ఆనంద్‌రెడ్డి, రాజా, ప్రేమ్‌కుమార్, యాదయ్యగుప్తా పాల్గొన్నారు.

హోటళ్లు, పాన్ షాపులపై ప్రత్యేక డ్రైవ్

పహాడీషరీఫ్: అర్ధరాత్రి వరకు కొనసాగుతున్న హోటళ్లు, పాన్ షాపులు, ఇతర వ్యాపార సముదాయాలపై బాలాపూర్ పోలీసులు శనివారం రాత్రి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. షాహీన్ నగర్, ఎర్రకుంట ప్రాంతాల్లో అర్ధరాత్రి దాటాక కూడా మండీ హోటళ్లు, పాన్ షాప్‌లు తెరిచే ఉంటుండడంతో నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రేడ్ లైసెన్స్ సమయాన్ని ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. దీంతో పాటు రాత్రి పూట జల్సాగా తిరుగుతున్న యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. హోటళ్లు, పాన్ షాప్ నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన సమయానికి మూసి వేయాలన్నారు. ఈ విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మల్లికార్జున భక్త సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దగౌని సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో శివదీక్ష చేపట్టే వారికి ఉచితంగా మాలధారణ, వసతి, భోజనం ఏర్పాటు చేసే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివస్వాములకు మాలధారణతో పాటు దర్శనం వరకు ఉచితం కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌కుమార్, శివస్వాములు నరేందర్, ప్రవీణ్, నిఖిల్, సంజయ్, సురేష్, హర్షిత్, అంజనేయులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ అందజేత



చెక్కు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు ఆర్థిక భరోసా ఇస్తోందని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీలో నివాసముండే బాలమణికి మంజూరైన రూ.39 వేల చెక్కును ఆదివారం రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, శివగౌడ్, వెంకట్‌రెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణతో మాలల అస్తిత్వానికే భంగం’



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

చంపాపేట: ఎస్సీ వర్గీకరణతో మాలల అస్తిత్వానికే భంగం వాటిల్లుతుందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నగర అధ్యక్షుడు రాజు వస్తాద్ ఆరోపించారు. ఆదివారం చంపాపేట డివిజన్ పోచమ్మ గడ్డ కాలనీలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో సమితి కార్యవర్గ సభ్యులు కట్టా వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు సంఘటితమై పోరుబాట పట్టాలన్నారు. డిసెంబర్ ఒకటిన పేరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల మహాసభకు భారీ సంఖ్యలో తరలి రావాలన్నారు. అనంతరం మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మన్నె శ్రీధర్, బలవతంరావు, మద్దెల నర్సింహా, వినోద్‌కుమార్, సత్యనారాయణ, ప్రవీణ్, రమేష్, జంగయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యం



రాజేంద్రప్రసాద్

లింగోజిగూడ: రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీ, నెల్లూర్‌కు చెందిన కామిరెడ్డి రాజేంద్రప్రసాద్ నగరంలో ఎస్‌ఎక్స్‌టీ రియల్ ఎస్టేట్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 21న రాత్రి తన కంపెనీలో టెలీకాలర్‌గా పనిచేసే స్వప్నకు ఫోన్‌చేసి తన కారు హయత్ నగర్‌లో పార్కుచేసి తాళంతో పాటు ఫోన్లు కారులోనే వదిలేసి వెళ్తున్నా.. వాటిని తీసుకెళ్లి తన కార్యాలయం వద్ద పెట్టాలని తెలిపాడు. ఆ తర్వాత రాజేంద్రప్రసాద్ గురించి వాకబు చేసిన ఆచూకీ లభించకపోడంతో నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 23న జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాజేంద్రప్రసాద్ అసోసియేట్ పార్ట్నర్ వేపరాల గురుకుమార్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసును హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్ ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం తవ్వి వ్యర్థాలను తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా కాంట్రాక్టర్లు పనులు ఇష్టానుసారంగా చేస్తుండటంతో ఇక్కట్లకు గురవుతున్నామని దారికి అడ్డంగా ఉన్న మట్టికుప్పలు వెంటనే తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. –మలక్‌పేట



అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కాలనీల్లోని ప్రధాన కూడళ్లు, చౌరస్తాలలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని సలీంనగర్ స్వామి వివేకానంద స్కూల్ చౌరస్తా, శాలివాహననగర్, భాష్యం స్కూల్‌లైన్, తదితర ప్రాంతాలలో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. కుళ్లిన పదార్థాలు, వ్యర్థాలతో ఈగలు, దోమలు, క్రిమి కీటకాలు వ్యాపించి రోగాలబారిన పడుతున్నామని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. –మలక్‌పేట

కార్తీక మాసం సందర్భంగా ఆదివారం మలక్‌పేటలోని శ్రీ హనుమాన్ మల్లికార్జున స్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ధర్మకర్తల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. – సాక్షి, సిటీబ్యూరో

